# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 20 మే 2025 | www.balagamtv.com | పేజీలు 4


## హైడ్రాలో డ్రైవర్ ఉద్యోగాలు

- పోటెత్తిన నిరుద్యోగులు ..

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

హైడ్రా ఇటీవల ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 200 డ్రైవర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. సోమవారం నుంచి బుధవారం ( మే 19, 21 ) వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపింది. ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలు రాసి స్వల్ప మార్కుల తేడాతో దూరమైన వారికీ ప్రాధాన్యత ఇస్తున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొంది. దీంతో రాష్ట్రంలోని నిరుద్యోగులు సోమవారం హైడ్రా కార్యాలయం వద్ద ఒక్కసారిగా పోటెత్తారు. ఈ ఉద్యోగాలకు అప్లై చేసుకునేందుకు అన్ని జిల్లాల నుంచి భారీగా యువత తరలి వచ్చారు. ఇవాళ ఉదయం 10 గంటల నుంచి క్యూ లైన్లో నిలబడి దరఖాస్తు చేసుకున్నారు.

హైడ్రా గతంలో కూడా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పలు నియామకాలు చేపట్టింది. 2025 ఫిబ్రవరి నెలలో డీఆర్ఎఫ్ లోకి 357 కొత్త ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించింది. ఈ ఉద్యోగులు అంబర్ పేట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లో వారం రోజుల శిక్షణ అనంతరం ఫీల్డ్ లోకి పంపారు. మొత్తం పోస్టుల సంఖ్య : 200, అర్హతలు: తెలంగాణలో గతంలో విడుదలైన పోలీస్ రిక్రూట్మెంట్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకొని ఫైనల్ రాత పరీక్ష రాసి, ఎంపిక కాని అభ్యర్థులకు ప్రాధాన్యత.



## గిరిజనులకు వరం

# ఇందిర సౌర గిరి జల వికాసం

- తెలంగాణను దేశానికే ఆదర్శంగా, నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం
- నల్లమల ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి అధికారులు ప్రత్యేకమైన ప్రణాళికలు రచించాలి.
- ప్రజల ఆశీస్సులతో అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం
- శాంతి భద్రతలు, పన్నుల వసూళ్లలో నెంబర్ వన్ స్థానంలో ఉన్నాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో ఇందిరా సౌరగిరి జల వికాసం పథకం ప్రారంభం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

"తెలంగాణ ప్రజల ఆశీస్సులతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తున్నాం.. అభివృద్ధి విషయంలో మంత్రివర్గం ఎంతో కృషి చేస్తోంది.. ఇప్పుడు ప్రారంభించుకుంటున్న ఇందిరా సౌరగిరి జల వికాసం పథకం గిరిజనులకు వరంలాంటిది.. ఆడబిడ్డల ఆర్థిక పురోభివృద్ధి కోసం పాటుపడుతున్నాం.. రాబోయే రోజుల్లో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం.. ఒక ఆడబిడ్డ ఆర్థికంగా నిలబడి ఎదిగితే ఆ కుటుంబం, ఆ ప్రాంతం ఎదుగుతుంది" అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలోని గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపే సరికొత్త పథకానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని 2,30,735 మంది గిరిజన రైతులకు 6.69 లక్షల ఎకరాలకు భూ యాజమాన్యపు హక్కులు కల్పించే "ఇందిర సౌర గిరి జల వికాసం" పథకానికి సంబంధించి "నల్లమల డిక్లరేషన్" ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన ముఖ్యమంత్రి మంత్రివర్గ సహచరులతో కలిసి గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి వారిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రులతో కలిసి నల్లమల డిక్లరేషన్‌ను విడుదల చేశారు. అనంతరం ముఖ్యమంత్రి ం మాట్లాడుతూ, "తెలంగాణను దేశానికే ఆదర్శంగా, నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని పదిహేడు నెలల్లో నిరూపించాం. ఇది సరిపోదు. ఇంకా ఎంతో ముందుకు వెళ్లాలి. అందుకు ప్రజలందరూ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి. డిక్లరేషన్‌లో ప్రకటించిన అంశాలను అమలు చేసి చూపిస్తాం. ప్రతి రైతుకు సోలార్ పంపుసెట్టు ఇవ్వడం ద్వారా విద్యుత్ అవసరం లేకుండా స్వయంగా ఆదాయాన్ని పెంచుకోవడానికి అచ్చంపేటలో చేసిన తరహాలో తెలంగాణ రాష్ట్రంలో చేయడానికి ప్రణాళికలు రూపొందించాలి.

నల్లమల ప్రాంతాన్ని అభివృద్ధి

మిగితా 2వ పేజీలో

## అచ్చంపేటను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



బలగం టీవీ, అమ్రాబాద్

సోలార్ విద్యుత్ ఆధారిత వ్యవసాయం చేసే నియోజకవర్గంగా అచ్చంపేటను దేశానికి ఆదర్శంగా తీర్చిదిదు తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. రోబోయే వంద రోజుల్లో ఈ నియోజకవర్గంలో రైతులందరికీ వంద శాతం సబ్సిడీతో సోలార్ విద్యుత్ పంపుసెట్లను అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఇందిర సౌర గిరి జల వికాసం" పథకాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. అక్కడే స్ప్రింక్లర్ డ్రిప్‌ను స్విచ్ ఆన్ చేశారు. ఈ ప్రతిష్టాత్మక పథక ఉద్దేశాన్ని వివరిస్తూ

మిగితా 2వ పేజీలో

## భారతదేశం ధర్మసత్రం కాదు

- సుప్రీం కోర్టు

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో



ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే శరణార్థులకు ఆశ్రయం కల్పించేందుకు భారత్ ఉచిత సత్రం కాదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. మన దేశంలో ఆశ్రయం కోరుతూ శ్రీలంక జాతీయుడు వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఇక్కడ సెటిల్ అయ్యేందుకు మీకేం హక్కు ఉందని ధర్మాసనం ప్రశ్నించింది. నిషేధిత సంస్థ లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టీటీఈ)తో సంబంధాలున్నాయని ఆరోపణలతో 2015లో శ్రీలంకకు చెందిన ఓ వ్యక్తిని తమిళనాడు పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో విచారణ జరిపిన ట్రయల్ కోర్టు.. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద 2018లో అతడిని దోషి తేలుస్తూ పదేండ్లు శిక్ష ఖరారు చేసింది. అనంతరం ఆ వ్యక్తి మద్రాసు హైకోర్టును ఆశ్రయించగా.. శిక్షను ఏడేండ్లకు తగ్గిస్తూ ఉన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించింది. అయితే, శిక్ష పూర్తి కాగానే దేశం విడిచి వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. దీనిపై నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. తాను చట్టబద్ధమైన వీసాపైనే భారత్‌కు వచ్చానని, స్వదేశంలో తన ప్రాణాలకు ముప్పు ఉందని పేర్కొన్నాడు. అంతేగాక, తన భార్యాపిల్లలు ఈ దేశంలోనే సెటిల్ అయ్యారని తెలిపాడు. తనకు ఇక్కడే ఆశ్రయం కల్పించాలని కోరాడు. దీనికి జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్ ధర్మాసనం స్పందిస్తూ పిటిషనర్‌పై అసహనం వ్యక్తం చేసింది. "ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే శరణార్థులకు భారతదేశం ఆశ్రయం ఇవ్వాలా? ఇప్పటికే మా దేశంలో 140 కోట్ల మంది జనాభా ఉంది. అన్ని దేశాల నుంచి వచ్చే వారిని ఆదరించేందుకు భారత్ ధర్మశాల కాదు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇక్కడ సెటిల్ అయ్యేందుకు మీకేం హక్కు ఉందని ప్రశ్నించింది. దీనికి పిటిషనర్ తరపు న్యాయవాది స్పందిస్తూ.. శ్రీలంకలో అతడి ప్రాణాలకు ముప్పు ఉందని తెలిపారు. అలాగైతే మరో దేశానికి వెళ్లండని సుప్రీం కోర్టు సూచించింది.

## రాష్ట్రంలో 77 మంది ఐపీఎస్‌ల బదిలీ




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో భారీగా ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 77 మంది డీఎస్పీలు, ఏసీపీలను బదిలీ చేశారు. అలాగే మరికొంతమందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ మేరకు సోమవారం నాడు డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల ఎస్డీపీవోగా ఎన్.వెంకటస్వామి, ఇంటెలిజెన్స్ డీఎస్పీగా డి.రఘుచందర్, బాలానగర్ ఏసీపీగా పి.నరేశ్ రెడ్డి, శంషాబాద్ ఏసీపీగా వి.శ్రీకాంత్ గౌడ్, మాదాపూర్ ఏసీపీగా సీహెచ్ శ్రీధర్, చిక్కడపల్లి ఏసీపీగా సీహెచ్. శ్రీకాంత్ బదిలీ అయ్యారు. మేడ్చల్ ఏసీపీగా సీహెచ్.శంకర్ రెడ్డి, సంతోశ్ నగర్ ఏసీపీగా సుఖ్‌దేవ్ సింగ్, మలక్‌పేట ఏసీపీగా సుబ్బారామిరెడ్డి, హుస్నాబాద్ ఏసీపీగా సదానందం, గాంధీనగర్(హైదరాబాద్) ఏసీపీగా ఎ.యాదగిరి బదిలీ అయ్యారు. చిక్కడపల్లి ఏసీపీగా ఉన్న ఎల్.రమేశ్ కుమార్, మేడ్చల్ ఏసీపీగా ఉన్న బి.శ్రీనివాస్ రెడ్డి, సంతోశ్‌నగర్ ఏసీపీ ఎండీ గౌజ్, మలక్‌పేట ఏసీపీ జి.శ్యామ్ సుందర్, హుస్నాబాద్ ఏసీపీ వి.సతీశ్‌ను డీజీపీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

## 26 నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



రాష్ట్రంలో భూపరిపాలనను మరింత మెరుగుపరచడానికి ఖచ్చితమైన భూ రికార్డులను రూపొం దించడం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయక త్వంలో ఇందిరమ్మ ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసం బంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూమి సర్వే మ్యాపును జతపరచడం తప్పనిసరి చేశామని ఈ విధానాన్ని వీలైనంత త్వరగా అమలులోకి తీసుకురావడానికి పెద్దసంఖ్యలో సర్వేయర్ల అవసరాన్ని గుర్తించడం జరిగిందన్నారు. ఇందుకోసం ఐదువేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకానికి ఈ నెల 17వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానించగా

మిగితా 2వ పేజీలో


## హైడ్రా కూల్చివేతలు..

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కూకట్పల్లి పరిధిలోని అల్విన్ కాలనీ, హైదర్ నగర్ లోని డైమండ్ ఎస్టేట్ లేఅవుట్లో 79 మంది అసలు ప్లాట్ల యజమానులకు హైడ్రా న్యాయం చేసింది. కబ్జాదారుల చెరలో ఉన్న ఈ లేఅవుట్ ను హైడ్రా అధికారులు విడిపించి అసలు యజమానులకు అప్పగించారు. హైదర్ నగర్ డివిజన్లోని సర్వేనెంబర్ 145 లో సుమారు 9 ఎకరాల 27 గుంటల విస్తీర్ణంలో డైమండ్ ఎస్టేట్స్ లేఅవుట్ ఏర్పాటు చేశారు. అయితే 2000 సంవత్సరంలో 79 మంది మధ్యతరగతి ప్రజలు ఈ లేఔట్ లో ప్లాట్లను కొనుగోలు చేశారు. ఆ తర్వాత కొంతకాలానికి ఆ స్థలం తమదని శివ దుర్గ ప్రసాద్ అనే ఒక వ్యక్తి మరికొందరితో కలిసి ఆ స్థలాన్ని ఆక్రమించుకున్నారు. అసలు యజమానులు ప్లాట్ల వద్దకు రాకుండా, న్యాయస్థానం నుండి స్టే తెచ్చుకుని అసలు యజమానులను ఇబ్బంది పెట్టారు. ఇక్కడ 79మంది ప్లాట్ల యజమానులు కోర్టు మెట్లెక్కారు. న్యాయ పోరాటం చేసి సుదీర్ఘ విచారణ తర్వాత గత సంవత్సరం సెప్టెంబర్లో కేసు గెలిచారు. న్యాయస్థానం ఈ స్థలాలు బాధితులకు చెందుతాయని తీర్పు ఇవ్వడంతో బాధితులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ కబ్జాదారులు మాత్రం స్థలాన్ని ఖాళీ చేసిపోలేదు. దీంతో బాధితులంతా ప్రజావాణి కార్యక్రమంలో హైడ్రాను ఆశ్రయించి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వారి ఫిర్యాదును స్వీకరించిన హైడ్రా అధికారులు తక్షణమే స్పందించి కబ్జాదారులు కట్టిన నిర్మాణాలను కూల్చివేసి, ఆ లే అవుట్ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.

## మళ్లీ వస్తోన్న కరోనా..

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



దేశంలో కరోనా కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర ప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఇటీవలి కాలంలో మొత్తం 257 కరోనా కేసులు నమోదైనట్లు వెల్లడైంది. ముఖ్యంగా మే 12వ తేదీ నుంచి వారం రోజుల వ్యవధిలోనే 164 కొత్త కేసులు వెలుగు చూడటం గమనార్హం. అయితే దేశంలో ప్రస్తుత కోవిడ్-19 పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని కేంద్ర ప్రభుత్వ అధికారులు స్పష్టం చేస్తున్నారు. హాంకాంగ్, సింగపూర్ వంటి దేశాల్లో కరోనా కేసులు ఇటీవల పెరుగుతున్నాయని, ఆ ప్రభావం కొంతమేర భారత్‌పై కనిపిస్తోందని వారు విశ్లేషిస్తున్నారు. అయినప్పటికీ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైన జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందని సూచిస్తున్నారు.

కేసుల వారీగా పరిశీలిస్తే, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో కరోనా ప్రభావం ఎక్కువగా ఉంది. గత వారం రోజుల్లో కేరళలో 69 కొత్త కరోనా కేసులు నమోదు కాగా, మహారాష్ట్రలో 44, తమిళనాడులో 34 కేసులు నమోదయ్యాయి. కరోనా కారణంగా మహారాష్ట్రలో ఇద్దరు వ్యక్తులు మరణించినట్లు వార్తలు వచ్చినప్పటికీ, అవి కోవిడ్ మరణాలు కావని వైద్యులు ధృవీకరించారు. మరణించిన ఇద్దరికీ కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయినప్పటికీ వారు ఇతర తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, ఆ కారణాలతోనే మరణించారని వైద్యులు వివరించారు. ప్రస్తుతం మహారాష్ట్రలో 56 కరోనా యాక్టివ్ కేసులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.



## అందాల పోటీలకు రూ.300 కోట్లు.. పుష్కరాలకు రూ.35 కోట్లా

- కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం - సరస్వతి పుష్కరాల సందర్భంగా గోదావరి, ప్రాణహిత, అంతర్వాహినిగా సరస్వతి కలయికతో ప్రఖ్యాతిగాంచిన త్రివేణి సంగమంలో కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పుణ్యస్నానం చేశారు. అనంతరం ముక్తేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే పుష్కారాల స్నానం చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద పుష్కర పండగకు విడుదల చేసిన 35 కోట్ల రూపాయలు ఏర్పాట్లకు సరిపోవన్నారు. యూపీ రాష్ట్రంలో కుంభమేళా కు 50 కోట్ల మందికి బీజేపీ ప్రభుత్వం సరిపడ నిధులు విడుదల చేసి ఘనంగా నిర్వహించిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. పుష్కరాలను కుంభమేళ తరహాలో కోట్లాది మందిని తరలించి ఘనంగా నిర్వహించే వాళ్ళమని చెప్పారు. అందాల పోటీలకు రూ. 300 కోట్లు విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్యాత్మికతకు రూ. 35 కోట్లు వెచ్చించడం ఏంటి? అని ప్రశ్నించారు. పుష్కరాలను ఈ ప్రాంతానికి పరిమితి చేయడం పద్ధతి కాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. వచ్చే పుష్కరాలకు ఎక్కువ బడ్జెట్ విడుదల చేసి ఘనంగా నిర్వహించాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగడంతో కాళేశ్వరానికి చెడ్డపేరు వచ్చిందని.. పుష్కరాలతోనైన మంచి పేరు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ముక్తీశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వం కోట్లు వెచ్చించిన నిధులు విడుదల చేయలేదని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన రూ. 200 కోట్ల హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

## అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్లుంటే ప్రాణ నష్టం తగ్గేది

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులు, ఫైరింజన్‌లో నీళ్లు ఉంటే గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాదంలో ప్రాణనష్టం తప్పదేని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఫైర్ బ్రిగేడ్‌కు సరైన మాస్కులు లేకపోవడంతో వాళ్లు లోపలికి వెళ్లి బాధితులను కాపాడుకోలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 125 సంవత్సరాల నుంచి చార్మినార్ దగ్గర ఉంటున్న అగర్వాల్ కుటుంబంలో 17 మంది చనిపోవడం హైదరాబాద్ చరిత్రలోనే విషాదకరమని అన్నారు. బాధిత కుటుంబసభ్యులకు రూ.25లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అందాల పోటీల మీద పెట్టిన శ్రద్ధ.. మౌలిక వసతుల కల్పనపై పెడితే బాగుంటుందని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. గుల్జార్ హౌస్ అగ్నిప్రమాదం విషయంలో బాధిత కుటుంబసభ్యులు ఎవర్నీ నిందించడం లేదని కేటీఆర్ అన్నారు. కానీ వారు కొన్ని విషయాలను మాత్రం చెప్పారని తెలిపారు. ఫైర్ బ్రిగెడ్లు నీళ్లు, సరైన మాస్కులు లేకుండా లోపలికి వచ్చారని, సరైన మాస్కులే లేకపోవడంతో వారు లోపలికి వెళ్లలేకపోయారని తెలిపారు. అంబులెన్స్‌ల్లో కూడా ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులు లేకపోవడం దారుణమని మండిపడ్డారు. ఫైరింజన్, అంబులెన్స్‌లో కనీస సదుపాయాలు ఉంటే కొన్ని ప్రాణాలు అయితే బతికేవని బాధిత కుటుంబసభ్యులు అంటున్నారు. తమకు జరిగిన నష్టం రాబోయే రోజుల్లో ఎవరికీ జరగకూడదని వారు కోరుకుంటున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఎవరు చనిపోకుండా చూడమని కోరామన్నారు.

తాను రాజకీయం చేయడానికి రాలేదని.. ఎవరినీ విమర్శించడం లేదని కేటీఆర్ తెలిపారు.కానీ ఎండాకాలం వచ్చిందంటే మున్సిపల్ శాఖ మంత్రి ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన చర్యల మీద రివ్యూ సమావేశం పెట్టుకోవాలని సూచించారు. పాతబస్తీ అత్యధిక జనసాంద్రత ఉన్న ప్రదేశం. ఏదైనా ప్రమాదం జరిగితే ఫైరింజన్లు, అంబులెన్స్ లు రావడానికి కూడా వీలుకాలేదని అన్నారు. అధికారులకు నిరంతరం ట్రైనింగ్ ఇవ్వాలని.. తరుచుగా మాక్ డ్రిల్స్ నిర్వహించాలన్నారు. కానీ ఇవేవి జరగలేదని.. ఇది మంచిది కాదని చెప్పారు. అంబులెన్స్‌లు వచ్చినయి కాని అందులో ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులు లేకపోవడంతోనే ఎక్కువ ప్రాణ నష్టం జరిగిందని తెలిపారు. ఎనిమిది మంది చిన్నారులు తమ కళ్లముందే చనిపోయారని చెబుతున్నారని అన్నారు.

ప్రాణాలు పోయిన తర్వాత నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవడం కాకుండా భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణనష్టం జరగకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అందాల పోటీలపై పెట్టే ఖర్చు ఇలాంటి సందర్భాల్లో ఉండాల్సిన మౌలిక సదుపాయాలపై పెట్టాలని సూచించారు. రేవంత్ రెడ్డి దగ్గరనే హెూం, మున్సిపల్ శాఖలు ఉన్నాయని గుర్తుచేశారు. సంఘటన స్థలం దగ్గరికి రేవంత్ రెడ్డి వస్తే బాగుండేదని అన్నారు. ఐదు లక్షల నష్టపరిహారం సరిపోదని.. ఇంటికి, వ్యాపారానికి తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు.. 125 సంవత్సరాల నుంచి హైదరాబాద్‌లో ఉంటున్న అగర్వాల్ కుటుంబం మళ్లీ తమ వ్యాపారం ప్రారంభించుకోవడానికి ప్రభుత్వం సహకరించాలన్నారు. బాధిత కుటుంబానికి రూ. 25 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ తరపున కూడా ఆదుకునే ప్రయత్నం చేస్తాము. రాజకీయం చేయడానికి రాలేదు. ఇలాంటి కడుపు కోత ఇంకెవరికి రాకూడదని వచ్చాను. ప్రభుత్వం మానవత్వంతో స్పందించాలని కోరారు.

## గిరిజనులకు వరం
## ఇందిర సౌర గిరి జల వికాసం

(మొదటి పేజీ తరువాయి)

చేయడానికి అధికారులు ప్రత్యేకమైన ప్రణాళికలు రచించాలి. ప్రభుత్వం అవసరమైన నిధులు విడుదల చేస్తుంది. ఈ ప్రాంతానికి సాగునీరు, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. పోడు భూములకు హక్కులు కల్పించి పంట భూములుగా మార్చి గిరిజనులను ఆత్మగౌరవంతో బతికే అవకాశం కల్పించాం. అచ్చంపేట నియోజకవర్గాన్ని, ఈ రాష్ట్రానికి దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దే బాధ్యతను స్థానిక రైతులు, గిరిజనులు ఇక్కడికి విచ్చేసిన వేలాది మంది రైతులు బాధ్యతగా తీసుకోండి. ప్రపంచానికే అచ్చంపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం. ఈ నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, కళాశాల వంటి పనులకు అధికారులు ప్రణాళికలు రూపొందించిన తర్వాత వాటిపై అవసరమైన నిర్ణయాలు తీసుకుంటా.ఈ ప్రభుత్వం రైతులకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోంది. రుణమాఫీ, బోనస్, రైతు భరోసా, ఉచిత విద్యుత్, 200 యూనిట్ల లోపు గృహ వినియోగంలో ఉచిత విద్యుత్ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టడమే కాకుండా సన్న బియ్యం అందిస్తున్నాం...” అని ముఖ్యమంత్రి గారు అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రిమండలి సభ్యులు, పలువురు లోక్‌సభ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అచ్చంపేటను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించిన కరపత్రాన్ని విడుదల చేశారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , దామోదర రాజనర్సింహ , తుమ్మల నాగేశ్వరరావు , జూపల్లి కృష్ణారావు , ధనసరి సీతక్క , పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ , ప్రణాళికా మండలి వైస్ చైర్మన్ జి చిన్నారెడ్డి గారు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ప్రారంభించారు. దేశానికే ఒక మాడల్‌గా, గిరిజన రైతుల జీవితాల్లో వెలుగులు నింపే ఈ పథకం పైలట్ ప్రాజెక్టును ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి 29 మంది పోడు భూముల రైతులతో ముఖాముఖి మాట్లాడుతూ, కీలక విషయాలను చెప్పారు. అక్కడికక్కడే అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.

“నియోజకవర్గంలో వచ్చే వంద రోజుల్లో రైతులందరికీ సోలార్ విద్యుత్ పంపుసెట్లను అమర్చాలి. ఉత్పత్తి చేసే సోలార్ విద్యుత్‌ను వ్యవసాయానికి, గృహావసరాలకు వినియోగించగా కొంత మిగులు ఉండేలా, ఆ మిగులు విద్యుత్‌ను ప్రభుత్వ గ్రిడ్‌కు అనుసంధానం చేసే విధంగా ఉండే ప్యానెల్స్ ఏర్పాటు చేయాలి. మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేయడం ద్వారా నెలకు 3 నుంచి 5 వేల రూపాయల మేరకు ఆదాయం లభించాలి. ఈ గ్రామంలో ప్రారంభించిన ఈ పథకం నియోజకవర్గం మొత్తంలో విస్తరించడంతో పాటు ఈ పథకంపై లబ్దిదారులకు అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా ఒక ఐఏఎస్ అధికారిని నియమించాలి. వచ్చే సంవత్సరం ఇదే రోజు మరోసారి పర్యటించి ఇక్కడ ప్రారంభించిన ఇందిర సౌర గిరి జల వికాసం పురోగతిని పరిశీలిస్తా. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో భూమి లేని చెంచుల విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలించి పది రోజుల్లోగా అందరికీ ఇండ్లు కేటాయిస్తాం. ఈ కార్యక్రమంలో లోక్‌సభ సభ్యులు డాక్టర్ మల్లు రవి , పోరిక బలరాం నాయక్ , స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 26 నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

10,031 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకంపై సోమవారం నాడు పొంగులేటి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 26వ తేదీ నుంచి గచ్చిబౌలి లోని సర్వే ట్రైనింగ్ అకాడమీ లో రెండు నెలల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోవడం వలన గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు భూ వివాదాలను పరిష్కరించాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

టిజిఆర్ఏసి తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్) ద్వారా సర్వే రికార్డులను (మ్యాపులు) డిజిటలైజేషన్ చేపడుతన్నామని మంత్రి తెలిపారు. ప్రయోగాత్మకంగా నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని లింగాల గ్రామం, జగిత్యాల జిల్లా మాల్యాల మండలంలోని తక్కలపల్లి, ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని పెద్దకోరుకొండి మూడు గ్రామాలలో ఈ ప్రక్రియను రెండు రోజుల్లో ప్రారంభించబోతున్నామని తెలిపారు.ఈ – డిజిటల్ మ్యాప్ లను ఎక్కడినుండైనా సులభంగా యాక్సెస్ చేయవచ్చని, మాన్యువల్ పద్ధతుల కంటే వేగంగా , తక్కువ ఖర్చుతో ఖచ్చితమైన సమాచారం పొందవచ్చన్నారు. డిజిటల్ మ్యాపింగ్ ద్వారా భూక్షేత్రాల పరిమాణం, ఆకృతి వంటి వివరాలు ఖచ్చితంగా పొందవచ్చన్నారు .ప్రభుత్వ సేవల్లో పారదర్శకత పెరగడంతో పాటు మ్యుటేషన్ ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. పునరుద్ధరణ , భద్రత డిజిటల్ రూపంలో భద్రంగా నిల్వ చేయవచ్చు కాలానుగుణంగా అప్డేట్ చేయవచ్చు అని వివరించారు.

### ఇందిరమ్మ ఇండ్లకు రూ.53.64 కోట్లు

ఇందిరమ్మ ఇండ్లకు రూ.53.64 కోట్లు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అనుగుణంగా నిధులు విడుదల చేస్తున్నట్టు రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఇప్పటి వరకు వివిధ దశల్లో ఉన్న 5,364 ఇండ్లకు రూ.53.64 కోట్లు చెల్లించినట్టు తెలిపారు. సోమవారం జూమ్ మీటింగ్ ద్వారా లబ్ధిదారులకు చెల్లింపులపై అధికారులతో సమీక్షించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద 47,335 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, 20,104 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లోని సర్వే రికార్డులను డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించినట్టు మంత్రి పొంగులేటి వెల్లడించారు. తొలుత ప్రయోగాత్మకంగా నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం లింగాల, జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కలపల్లి, ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పెద్దకోరుకొండిలో ఈ ప్రక్రియను ప్రారంభించనున్నట్టు తెలిపారు. 5 వేల సర్వేయర్ల నియామకానికి 10, 031 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు.

## డిక్లరేషన్లు ప్రకటించడమే తప్ప.. అమల్లో డెడికేషన్ లేదు..

- మాజీ మంత్రి హరీశ్‌రావు

**బలగం టీవి, హైదరాబాద్**

ఆర్భాటంగా డిక్లరేషన్లు ప్రకటించడమే తప్ప.. అమలు చేసే డెడికేషన్ మాత్రం అస్సలు లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అమలు చేస్తామన్న రైతు డిక్లరేషన్ ఆగమైపోయింది.. బీరాలు పలికిన బీసీ డిక్లరేషన్ దిక్కు లేకుండా పోయిందని.. ఇప్పుడు కొత్తగా నల్లమల డిక్లరేషన్ తెరమీదకు తీసుకొచ్చారని మండిపడ్డారు. పైన పటారం లోన లొటారం డిక్లరేషన్ల పేరిట డంబాచారమని సెటైర్ వేశారు. తాను నల్లమల బిడ్డనని గొప్పలు చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి.. తనను కలుసుకోవడానికి వచ్చిన అమాయక చెంచు బిడ్డలను అరెస్టు చేసి తన నిరంకుశ నైజాన్ని మరోసారి బయటపెట్టుకున్నాడని హరీశ్‌రావు విమర్శించారు. ఎక్కడిక్కడ ముందస్తు అరెస్టులు చేసి, చెంచు ఉద్యమ నాయకులను నిర్బంధించి నల్లమల డిక్లరేషన్ ప్రకటించడమే ప్రజా పాలనా అని ప్రశ్నించారు. ఎప్పటిలాగే రేవంత్ ప్రసంగంలో తెచ్చి పెట్టుకున్న ఆవేశం తప్ప, కంటెంట్ లేదు, కాంటెస్ట్ లేదని అన్నారు. ఆత్మస్తుతి పరనింద తప్ప, అక్కరకు వచ్చే ముచ్చట లేదని విమర్శించారు. అలవాటైన ఊకదంపుడు ప్రసంగాన్నే అదే పనిగా దంచాడని అన్నారు. తమ పరిపాలన ప్రయోజానలను ప్రజలు పదే పదే గుర్తు చేసుకుంటున్నారని డబ్బా కొట్టుకున్నడని చెప్పారు.అవును రేవంత్ రెడ్డి గారూ.. మీ



అసమర్థ పాలనలో అమలు కాని హామీలను ప్రజలు పదే పదే గుర్తు చేసుకుంటున్నారు అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రుణమాఫీ ఎగ్గొట్టినందుకు, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ బావురుమంటున్నందుకు.. కల్లాల దగ్గర పడిగాపులు కాస్తూ కన్నీరు పెట్టుకుంటున్నందుకు.. వడగండ్లతో పంట నష్టపోయి గుండెలు బాదుకుంటున్నందుకు రైతులు.. మిమ్మల్నే గుర్తు చేసుకుంటున్నారని మండిపడ్డారు. మహాలక్ష్మి కింద నెల నెలా రావాల్సిన 2500 ఇంకా రావడం లేదని ఆడబిడ్డలు.. కల్యాణ లక్ష్మి కింద రావాల్సిన తులం బంగారం కోసం ఆడపిల్ల తల్లిదండ్రులు.. మీరిస్తామన్న స్కూటీల కోసం ఆశగా ఎదురు చూస్తున్న యువతులు.. పదే పదే గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. విద్యాభరోసా కింద ఇస్తామన్న 5 లక్షల కార్డు కోసం విద్యార్థులు.. ఏడాదిలో ఇస్తామని చెప్పి ఏడాదిన్నర దాటుతున్నారని 2లక్షల ఉద్యోగాల కోసం, ఏ నెలకు ఆ నెలకు ఖాళీలను భర్తీ చేస్తూ ప్రకటిస్తామన్న జాబ్ క్యాలెండర్ కోసం నిరుద్యోగులు గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. ఇంకా పింఛన్లు పెంచుతలేవని అవ్వాతాతలు, దివ్యాంగులు, నిస్సహాయులు.. డీఏ, పీఆర్సీ, పింఛన్ ప్రయోజనాల కోసం ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు.. తమను ఎప్పుడు ప్రభుత్వంలో విలీనం చేస్తారా అని ఆర్టీసీ కార్మికులు నిత్యం నిన్నే తలుచుకుంటున్నరని తెలిపారు.

రేవంత్ రెడ్డి అతిశయోక్తులు ఎట్లా ఉంటాయంటే, అమాస నాడు పున్నమి వెన్నల అనగలడని హరీశ్‌రావు సెటైర్ వేశారు. ఓవైపు నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగులు కండ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తుంటే, నిరుద్యోగులే నోటిఫికేషన్లు వద్దంటున్నారని తుపాకీ రాముని డైలాగులు పేలుస్తూ కామెడీ చేస్తున్నడని అన్నారు. దేశాలు తిరిగి తెచ్చామని ప్రచారం చేసుకుంటున్న పెట్టుబడుల వ్యవహారం ఎట్లుందంటే, సచ్చిపోయిన బర్రె పగిలి పోయిన కుండెడు పాలు ఇచ్చిందన్న చందంగా ఉందన్నారు. అసలు ఆరు గ్యారెంటీల ఊసెత్తడమే మానేసిండు. ఇంతకన్నా మోసం, దగా ఇంకేం ఉంటుందని మండిపడ్డారు. గుడ్డిలో మెల్ల అన్నట్లు రాష్ట్రం దివాలా, దివాలా అన్న పాట మాత్రం పాడలేదు. నెంబర్ వన్ రాష్ట్రం అని మాట మార్చిండు అన్నారు. రేవంత్ రెడ్డి రంగులు మార్చే తీరును చూసి నల్లమల అడవుల్లోని ఊసరవెళ్లులు కూడా నివ్వెరపోతున్నాయని విమర్శించారు.

## తెలంగాణలో నాలుగు రోజులు వర్షాలు..

### పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

**బలగం టీవి, హైదరాబాద్**

బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం కారణంగా తెలంగాణ రాష్ట్రంలో రాబోయే నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సోమ, మంగళవారాల్లో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేసింది. కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. కొన్నిచోట్ల భారీ వర్షాలు కూడా నమోదయ్యే సూచనలున్నాయని, ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు వెల్లడించింది. ఈ వర్షాల వల్ల రాష్ట్రంలో ఎండల తీవ్రత తగ్గి, పగటి ఉష్ణోగ్రతలు సుమారు ఐదు డిగ్రీల వరకు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనాల ప్రకారం, నైరుతి రుతుపవనాలు అనుకున్న సమయం కంటే ముందుగానే కేరళ తీరాన్ని తాకే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం అండమాన్ నికోబార్ దీవుల్లో రుతుపవనాలు పూర్తిగా విస్తరించి ఉన్నాయి. తొలుత ఈ నెల 27న కేరళ తీరాన్ని తాకుతాయని ఐఎండీ అంచనా వేసినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం మే 24వ తేదీనే కేరళలోకి ప్రవేశించి, జూన్ మొదటి వారంలోపు తెలంగాణలోకి కూడా ప్రవేశించే అవకాశాలు ఉన్నాయి.

## అగ్నిప్రమాదంపై హెచ్‌ఆర్సీ విచారణ

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్‌లోని చార్మినార్ సమీపంలో గుల్జార్‌హౌస్ వద్ద శ్రీకృష్ణ పెరల్స్ భవనంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాద ఘటనను తెలంగాణ మానవహక్కుల కమిషన్ (టీజీహెచ్‌ఆర్సీ) సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఈ దుర్ఘటనలో 17 మంది మృతిచెందారని, భవన భద్రత, విద్యుత్తు నిర్వహణ, అగ్నిప్రమాద నివారణకు సంబంధించిన నిబంధనలను పాటించకపోవడమే ఇందుకు కారణమని పేర్కొంటూ మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా ఈ నెల 30న విచారణ చేపట్టనున్నట్టు టీజీహెచ్‌ఆర్సీ ప్రకటించింది. ఈ లోగా ఆ అగ్నిప్రమాదంపై సమగ్ర నివేదిక సమర్పించాలని సీఎస్‌తోపాటు హైదరాబాద్ పోలీస్ కమిషనర్, ఫైర్ డిపార్ట్‌మెంట్ డీజీ, ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజినీర్లను ఆదేశించింది.

## ప్రెస్ క్లబ్ లో కొట్టుకున్న ఐఎన్టీయుసీ నాయకులు

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్‌లో ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ నాయకులు బాహాబాహీకి దిగారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ సంఘాల నాయకుల మధ్య గొడవ జరిగింది. ఐఎన్టీయూసీ(ఆర్) అంబటి కృష్ణమూర్తి వర్గీయులపై ఐఎన్టీయూసీ సంజీవరెడ్డి వర్గీయులు దాడికి దిగారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఐఎన్టీయూసీ(ఆర్) నేషనల్ ప్రెసిడెంట్ అంబటి కృష్ణమూర్తి ప్రెస్‌మీట్‌ను అడ్డుకున్న ఐఎన్టీయూసీ నేత సంజీవరెడ్డి అనుచరుడు చంద్రశేఖర్, ఇతర వర్గీయులు దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో అంబటి వర్గీయులు సైతం సంజీవరెడ్డి వర్గీయులపై ఎదురుదాడికి దిగారు. ఈ క్రమంలో ఒకరిపై మరొకరు పిడిగుద్దులు కురిపించుకున్నారు. అయితే రంగంలోకి దిగిన అబిడ్స్ పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పారు. సంజీవరెడ్డి అనుచరుడు చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అంబటి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. సంజీవరెడ్డి తనపై నిరాధార ఆరోపణలు చేశారని ఆరోపించారు. ఆ ఆరోపణలను ఖండించేందుకు ప్రెస్‌మీట్ పెడితే దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు



# సప్లమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**



**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణ పై సోమవారం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరేట్లో సమావేశ మందిరంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సమీక్షలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ధేశించిన షెడ్యూలు ప్రకారం నిర్వహించుటకు కట్టుదిట్ట మైన ఏర్పాట్లు చేయాలని అన్నారు.జిల్లాలో మే, 22 నుంచి మే 29, 2025 వరకు ఇంటర్ తియరీ పరీక్షలు,జూన్ 03 నుండి 12 వరకు (ప్రాక్టికల్) ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తామని, దీనికి తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ఉ. 9.00 నుండి మ.12.00 వరకు రెండవ సంవత్సరం మధ్యాహ్నం 2:30 నుండి 5:30 వరకు పరీక్షలు జరుగుతాయని, మొదటి సం.2385 రెండవ సం.1478 మొత్తం 3863 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఇందుకు గాను 13 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వం పరీక్షల నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా పరిక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఒక గంట ముందుగా పరీక్షా కేంద్రానికి హాజరుకావాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో అవసరమైన మౌలిక వసతులు ఏర్పాట్లు చేయాలని, ప్రతి కేంద్రం వద్ద ఏ.ఎన్.ఎం స్థాయిలో వైద్య సిబ్బంది, ఓ.అర్.ఎస్. ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలనిఅన్నారు.

జిల్లాలో పరీక్ష ప్రశ్నపత్రాలను నిల్వ జేయుటకు పోలిస్ స్టేషనలో తగిన ఏర్పాట్లు చేయాలని, ప్రశ్నపత్రాలకు పోలిసు బందోబస్తు కల్పించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన సదుపాయాలు కల్పించాలని, పరీక్ష కేంద్రాల వద్ద తప్పనిసరిగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, సెంటర్లలో మాస్ కాపీయింగ్ మరియు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలకు విద్యార్థులకు ఒత్తిడి లేకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారికి ధైర్యం చెప్పాలని అన్నారు. జిల్లాలో పరీక్షలు నిర్వహించే పరీక్షలకు ప్రశ్న పత్రాలను పోలిసు వారి బందోబస్తు వుంచి తీసుకొని వెళ్లాలని, జిల్లాలోని రెవెన్యూ శాఖ నుండి పరీక్షా కేంద్రాలకు ఫ్లైయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేసి పరీక్ష జరుగుతున్న తీరు పై నిఘా వుంచాలని , 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్షా కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు.

పరీక్షా కేంద్రాల వద్ద మంచి నీరు, ఫ్యాన్లు, లైట్లు సరి అయిన విదంగా వుండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని , వెలుతురు వుండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్ష నిర్వహణ అనంతరం సమాధాన పత్రాలను సరిగా సీల్ చేసి పోస్టల్ ద్వారా తరలించే ప్రక్రియ పకడ్బందిగా చేపట్టాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సరైన సమయంలో చేరుకునే విధంగా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకి సూచించారు. అదనపు ఎస్పీ చంద్రయ్య ,ఆర్డీవోలు రాధాబాయి వెంకటేశ్వ రావు,జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శ్రీనివాస్ , విద్యా, వైద్య,ఫైర్, ఆర్.టి.సి, పోస్టల్ శాఖల అధికారులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# క్రికెట్ టూడే లీగ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఎంపికైన రైసింగ్ అకాడమీ క్రీడాకారులు

**బలగం టీవీ, సిరిసిల్ల**







క్రికెట్ టూ డే లీగ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కి రైసింగ్ అకాడమీ క్రీడాకారులు ఎంపికయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లో రాజన్న సిరిసిల్ల క్రికెట్ సెలక్షన్స్ కరీంనగర్ డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ లింగాల నర్సింగరావు గ్రౌండ్ లో నిర్వహించిన అండర్ 17 విభాగంలో సిరిసిల్ల లో ని రైసింగ్ అకాడమీ క్రీడాకారులు లక్ష్మి వరప్రసాద్ వికెట్ కీపర్ కామ్ బ్యాటర్, దీపక్ బ్యాటర్ మరియు లూమీర్ బౌలర్ లు సెలక్షన్స్ అయ్యారని అకాడమీ క్రికెట్ కోచ్ సాయి తేజ తెలిపారు..సెలక్షన్స్ అయినా క్రీడాకారులను స్థానిక ప్రజాప్రతినిధులు, రాజన్న సిరిసిల్ల జిల్లా క్రికెట్ అసోసియేషన్,సీనియర్ క్రికెట్ క్రీడాకారులు మరియు అకాడమీ క్రీడాకారుల,పేరెంట్స్ అభినందనలు తెలిపారు..

# డెంగ్యూ ప్రబలకుండా ముందస్తుగా పారిశుధ్య పనులు చేపట్టాలి

**-ప్రతి మంగళ, శుక్రవారాలు డ్రై డే పాటించాలి**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో డెంగ్యూ ప్రబలకుండా ముందస్తుగా పారిశుధ్య పనులు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.డెంగ్యూ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో పి పి టీ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ రాబోయే వానాకాలంలో డెంగ్యూ రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని సన్నద్ధం కావాలని అన్నారు. ప్రతి మున్సిపల్ వార్డులో నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించాలని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలనిఅన్నారు.

జ్వరాలు వచ్చాక ఇబ్బంది పడే కన్నా ముందుగా నియంత్రణ చర్యలు చేపట్టాలని,ఇండ్లలో ఉన్న నీటి నిల్వలను గుర్తించి మాపింగ్ చేయాలని, నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని, ప్రతి మంగళ/ శుక్ర వారాలలో డ్రైడే కార్యక్రమంలో వాటర్ లాగిన్ పాయింట్ల మరమ్మత్తు పనులు చేపట్టాలని పేర్కొన్నారు. నీరు అధికంగా నిలువ ఉన్న ప్రాంతాల్లో కీటక నాశన, యాంటీ లార్వా స్ప్రే చేయాలని, ఆయిల్ బాల్స్ వేయాలని ఆదేశించారు. డ్రైయిన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని,పట్టణ ప్రాంతాల్లో ఉన్న మహిళా సంఘాలచే అవసరమైన మేర ఆయిల్ బాల్ తయారు చేసి సిద్ధంగా ఉండాలని అన్నారు.అధికారులు తమ పరిధిలోని వార్డుల్లో ప్రజలకు ఆరోగ్యం, పరిశుభ్రత , దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వార్డు సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కరపత్రాలు, చెత్త సేకరణ వాహనాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు.

ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని, వైద్య సేవలు అందించాలని, అనుమానితుల నుండి రక్త నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం పంపించాలని అన్నారు. మున్సిపల్ పరిధిలోని హాస్పిటల్లో డెంగ్యూ రాపిడ్ టెస్ట్ లు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ప్రతి మంగళవారం మరియు శుక్రవారం డ్రై డే కార్యక్రమం కింద నిల్వ ఉన్న నీరు తొలగించాలని, ఇంటిలో నీరు నిల్వ ఉంచుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. ఫాగింగ్ యంత్రాల పనితీరును పరిశీలించి వాటిని బాగు చేసి రెగ్యులర్ ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత, మున్సిపల్ కమిషనర్లు అన్వేష్, వాణి,సంబంధిత వైద్య అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నర్మాలలో నీటి కట కట..

**- మంచి నీటి కోసం ఖాళీ బిందెలతో మహిళల నిరసన..**

**బలగం టీవీ, గంభీరావుపేట**

గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలో 6,7,8 వార్డులలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని కాలనీ వాసులు సోమవారం నిరసన చేపట్టారు. మహిళలు ఖాళీ బిందెలు బకెట్లతో కాలనీలో నిరసన తెలిపారు. 20 రోజుల క్రితం రెండు బోర్లు కాలిపోయయని ఇప్పటి వరకు మరమ్మతులు చేయించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు ఒకటి రెండు బిందెలు మాత్రమే వస్తున్నాయని వాపోయారు. గ్రామపంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని, బోర్లు రిపేర్లు చేయడానికి డబ్బులు లేవని చెబుతున్నారని మమ్మల్ని పట్టించుకునే నాధుడే కరువయ్యారని కాలనీవాసులు మండిపడ్డారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే..

**- ఎస్పీ మహేష్ బి.గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ మహేష్. బి.గితే అన్నారు.సోమవారం సిరిసిల్ల పట్టణంలో ని జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమన్ని నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 33 ఫిర్యాదులు స్వీకరించినారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్. బి.గితే మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని అన్నారు.



# పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలి

**-ఫీవర్ సర్వే సక్రమంగా చేపట్టాలిలి**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, సిరిసిల్ల**

వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.సోమవారం వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యటించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాప్తి పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజలు తమ ఇంట్లో, పరిసరాల్లో నీరు నిలువుండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.ప్రతి రోజూ క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించాలని వైద్య అధికారులకు సూచించారు. జ్వరం లక్షణాలు ఉన్న వారిని ప్రభుత్వ దవాఖానకు తరలించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా వైద్యాధికారి రజిత, ఇన్చార్జి ఎంపీడీఓ అబ్దుల్ వాజిద్ వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఏసీసీకి ఎలాంటి ప్రతిపాదన చేయలేదు

**బలగం టీవి, హైదరాబాద్**



ఆసియా క్రికెట్ మండలి నిర్వహించే అన్ని క్రికెట్ టోర్నీలకు దూరంగా ఉండేందుకు బీసీసీఐ నిర్ణయించినట్లు వస్తున్న వార్తలపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందించారు. ఆ వార్తల్లో వాస్తవం లేదన్నారు. ఏసీసీ ఈవెంట్లలో పాల్గొనాలా వద్దా అన్న అంశంపై బీసీసీఐలో ఎటువంటి చర్చ జరగలేదన్నారు. ఏసీసీకి కూడా ఎటువంటి ప్రతిపాదన చేయలేదన్నారు. ప్రస్తుతం తమ ఫోకస్ అంతా ఐపీఎల్, ఆ తర్వాత జరిగే ఇంగ్లండ్ సిరీస్‌పై ఉన్నట్లు తెలిపారు. ఏసీసీ ఈవెంట్లను బహిష్కరిస్తున్నట్లు వస్తున్న వార్తలు అన్నీ ఊహాజనితమైనవే అన్నారు. తాము ఏ నిర్ణయాన్ని తీసుకున్నా మీడియా ద్వారా వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఇండోపాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో.. వచ్చే నెలలో జరిగే మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ టోర్నీ నుంచి తప్పుకుంటున్నట్లు ఇప్పటికే ఏసీసీకి బీసీసీఐ చెప్పినట్లు వార్తలు సోషల్ మీడియాలో వచ్చాయి. ఇక సెప్టెంబర్‌లో జరగనున్న పురుషుల ఆసియా కప్ టోర్నీ నుంచి కూడా ఇండియా తప్పుకున్నట్లు వార్తలు వచ్చాయి.

# నటుడు భరత్ తల్లి హఠాన్మరణం

**బలగం టీవి, హైదరాబాద్**



టాలీవుడ్ యువ నటుడు మాస్టర్ భరత్ తల్లి కమలాసిని హఠాన్మరణం చెందారు. ఆదివారం రాత్రి చెన్నైలో ఆమె గుండెపోటుతో కన్నుమూశారు. కమలాసిని గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తెలుస్తోంది. తల్లి అకాల మరణంతో భరత్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. భరత్‌కు మాతృ వియోగం విషయం తెలుసుకున్న పలువురు సినీ ప్రముఖులు ఆయనకు ఫోన్ చేసి ధైర్యం చెబుతున్నారు. బంధువులు, కుటుంబ సభ్యులతో పాటు పలువురు సినీ ప్రముఖులు చెన్నైలోని భరత్ ఇంటికెళ్లి కమలాసిని భౌతిక కాయాన్ని సందర్శిస్తున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నారు. కాగా, బాల నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న భరత్... సుమారు 80కు పైగా సినిమాల్లో నటించాడు. రెడీ, వెంకీ, ఢీ, కింగ్, దూకుడు, మిస్టర్ పర్ఫెక్ట్, పెదబాబు, ఆనందమానందమాయే, గుడుంబా శంకర్, హ్యాపీ, పోకిరి, అందాల రాముడు, దుబాయ్ శీను ఇలా ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించాడు.

# సన్‌రైజర్స్ హైదరాబాద్ గెలుపు.. లక్నో ఔట్


- హాఫ్ సెంచరీతో చెలరేగిన అభిషేక్ శర్మ
- 6 వికెట్ల తేడాతో ఎల్ఎస్‌జీపై గెలిచిన సన్ రైజర్స్ హైదరాబాద్
- టోర్నీ నుంచి నిష్క్రమించిన లక్నో సూపర్ జెయింట్స్



**బలగం టీవి, హైదరాబాద్**

లక్నోలోని వాజ్ పేయి స్టేడియంలో లక్నో సూపర్ జెయింట్స్ పై సన్ రైజర్స్ హైదరాబాద్ టీమ్ 6 వికెట్ల తేడాతో నెగ్గింది. 206 పరుగుల లక్ష్యాన్ని మరో 10 బంతులు మిగిలుండగానే ఛేదించింది. ఈ ఓటమితో లక్నో సూపర్ జెయింట్స్ అధికారికంగా ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 205 పరుగులు చేసింది. ఓపెనర్లు మిచెల్ మార్ష్(39 బంతుల్లో 6 ఫోర్లు 4



సిక్స్‌లతో 65), ఎయిడెన్ మార్క్‌రమ్(38 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 61) హాఫ్ సెంచరీలతో రాణించగా.. నికోలస్ పూరన్(26 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 45) దూకుడుగా ఆడాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో ఇషాన్ మలింగా(2/28) రెండు వికెట్లు తీయగా.. హర్ష్ దూబే, హర్షల్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డిలు తలో వికెట్ తీసారు.

అనంతరం లక్ష్యచేధనకు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 18.2 ఓవర్లలో 4 వికెట్లకు 206 పరుగులు చేసి గెలుపొందింది. అభిషేక్ శర్మ(20 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్స్‌లతో 59) హాఫ్ సెంచరీతో రాణించగా.. ఇషాన్ కిషన్(28 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 35), హెన్రీచ్ క్లాసెన్(28 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 47), కామిందు మెండీస్(21 బంతుల్లో 3 ఫోర్లతో 32) కీలక ఇన్నింగ్స్ ఆడారు. లక్నో బౌలర్లలో దిగ్వేష్ రతి(2/37) రెండు వికెట్లు తీయగా.. విల్ ఓ రూర్కీ, శార్దూల్ ఠాకూర్ చెరో వికెట్ తీసారు.

అనంతరం 206 పరుగుల భారీ లక్ష్యచేధనలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆశించిన శుభారంభం దక్కలేదు. ట్రావిస్ హెడ్ స్థానంలో వచ్చిన అథర్వ తైడే 13 పరుగులు చేసి అవుటయ్యాడు. అయితే మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (59), వన్‌డౌన్ బ్యాటర్ ఇషాన్ కిషన్ (35), హెన్రిచ్ క్లాసెన్ (47), కమిందు మెండిస్ (32) రాణించడంతో గెలుపొందింది. చివర్లో నితీశ్ కుమార్ రెడ్డి (5 నాటౌట్) గెలుపునకు అవసరమైన పరుగులు కొట్టి సన్ రైజర్స్ శిబిరంలో ఆనందం నింపాడు. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లలో దిగ్వేష్ రాఠీ 2, ఓ రూర్కీ 1, శార్దూల్ ఠాకూర్ 1 వికెట్ తీశారు.

ఇషాన్ కిషన్‌తో కలిసి అభిషేక్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్ చెలరేగాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. దాంతో పవర్ ప్లేలోనే ఆరెంజ్ ఆర్మీ వికెట్ నష్టానికి 72 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దూకుడుగా ఆడుతున్న అతని దిగ్వేష్ రతి పెవిలియన్ చేర్చాడు. దాంతో రెండోవికెట్‌కు నమోదైన 82 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.

# జూన్ 1 నుంచి థియేటర్లు బంద్..!

**బలగం టీవి, హైదరాబాద్**

తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ చేయాలని సినీ ఎగ్జిబిటర్లు నిర్ణయించారు. రెంటల్ బేసిస్‌లో (అద్దె ప్రాతిపదిక) సినిమాలు ప్రదర్శించలేకపోవడంతో ఎగ్జిబిటర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. తమకు పర్సంటేజీ రూపంలో చెల్లిస్తేనే సినిమాలు ప్రదర్శిస్తామని ఎగ్జిబిటర్లు స్పష్టం చేశారు. తెలుగు ఫిలిం ఛాంబర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి నిర్మాతలు దిల్ రాజు, సురేశ్ బాబుతోపాటు 60 మంది ఎగ్జిబిటర్లు హాజరయ్యారు. చాలా రోజులుగా పర్సంటేజీలపై ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లకు మధ్య చర్చ నడుస్తోంది. రెంటల్ పద్దతిలో సినిమాలు ప్రదర్శించడం సాధ్యం కాదని ఓ వైపు ఎగ్జిబిటర్లు అంటుండగా.. మరోవైపు వారికి పర్సంటేజీలు ఇవ్వలేమని డిస్ట్రిబ్యూటర్లు అంటున్నారు. ఈ వ్యవహారం నిర్మాతలకు ఇబ్బందిగా మారుతోంది. ఈ క్రమంలో ఎగ్జిబిటర్ల జాయింట్ మీటింగ్‌లో పర్సంటేజీ, ప్రభుత్వ విధానాలపై చర్చించారు. నిర్మాతలకు ఇందుకు సంబంధించిన ఓ లేఖ రాయాలని సమావేశంలో తీర్మానించారు.

# విజయ్ సేతుపతి ఏస్ ట్రైలర్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**




కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి.నటిస్తున్న చిత్రం ఏస్. 'ఒరు నల్ల నాల్ పాత్తు సొల్రెన్' ఫేం ఆరుముగకుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. రుక్మిణి వసంత్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా%ొ% యోగి బాబు కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ మూవీ మే 23, 2025న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఇప్పటికే తెలుగు ట్రైలర్‌ను కూడా విడుదల చేశారు.

ట్రైలర్‌లో నువ్వు అక్కడేం చేస్తావురా అని ఫ్రెండ్ అడుగుతుంటే.. పాత ఐడెంటిటీస్ అన్నీ చింపేసి అందరిలా మామూలుగా బతకాల నుంది. నా పేరు బోల్ట్ కాశీ అంటూ తనను తాను పరిచయం చేసుకుం టున్నాడు విజయ్ సేతుపతి. నువ్వు ఈ ఊరికి ఏ పని మీదొచ్చావ్ అని హీరోయిన్ అడిగితే ఏం చేయాలో నేను ప్లాన్ చేశానంటున్నాడు. అసలు నీ ప్లాన్ ఏంటో చెప్పరా అని యోగిబాబు అడుగుతుంటే నాకీ ప్లాన్ ఓకే అంటోంది రుక్మిణి వసంత్. ఇంతకీ బోల్ట్ కాశీ పాత ఐడెంటిటీస్ ఏంటీ.. అతని స్కెచ్ ఏంటనేది సస్పెన్స్‌లో పెడుతూ కట్ చేసిన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. విజయ్ సేతుపతి నుంచి అభిమానులు ఆశించే అన్ని ఎలిమెంట్స్ సినిమాలో ఉండబోతున్నాయని ట్రైలర్ హింట్ ఇచ్చేస్తుంది.ఈ చిత్రాన్ని తెలుగులో ఎస్‌పీ సినిమాస్ విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే మేకర్స్ తెలియజేశారు. రొమాంటిక్ క్రైం కామెడీ నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీతో రుక్మిణి వసంత్ కోలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. ఈ చిత్రంలో దివ్య పిళ్లై, బబ్లూ పృథ్వీరాజ్, బిఎస్. అవినాష్, ముత్తు కుమార్, రాజ్ కుమార్, డెనెస్ కుమార్, ఆల్విన్ మార్టిన్, ప్రిస్సిల్లా నాయర్, జాస్పర్ సుపయ్య, కార్తీక్ జై, నాగులన్, జహ్రినారిస్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీని 7Cs ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్ నిర్మిస్తుంది.

# విశాల్‌ను పెండ్లి చేసుకోనున్న హీరోయిన్

**బలగం టీవి, హైదరాబాద్**



నటుడు విశాల్ పెళ్లిపై పలు వార్తలు వినిపిస్తూ ఉన్నాయి. అయితే, తాజాగా విశాల్‌తో పెళ్లిపై హీరోయిన్ సాయి ధన్సిక క్లారిటీ ఇచ్చేసింది. ఓ ఈవెంట్‌లో మాట్లాడిన సాయి ధన్సిక త్వరలోనే తాను పెళ్లి చేసుకోబోతున్నానని.. హీరో విశాల్‌తో తన పెళ్లి ఆగస్టు 29న జరగనుందని తెలిపింది. అదే ఈవెంట్‌లో విశాల్ కూడా ఉండటంతో వారు అధికారికంగా తమ పెళ్లి డేట్‌ను ప్రకటించారు. విశాల్ మాట్లాడుతూ, "సాయి ధన్సిక చాలా మంచి వ్యక్తి. మేమిద్దరం కలిసి ఓ అద్భుతమైన జీవితాన్ని ప్రారంభించబోతున్నాం. పెళ్లి తర్వాత కూడా ఆమె నటనను కొనసాగిస్తుంది" అని స్పష్టం చేశారు. సాయి ధన్సిక మాట్లాడుతూ, "కొంతకాలం క్రితం మా మధ్య పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారింది. విశాల్ ఎప్పుడూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. ఇక ఈ వార్తతో వారి అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.


# నేడు 'వార్ 2' టీజర్

**బలగం టీవి, హైదరాబాద్**

మ్యాన్ ఆఫ్ మాస్ ఎన్టీఆర్ బర్త్ డే కానుకగా వార్ 2 టీజర్ మంగళవారం విడుదల కానుంది. వార్ 2 టీజర్ మంగళవారం మే 20 ఉదయం 11 గంటలకి అన్ని భాషల్లో విడుదల కానుందట. మొత్తానికి మాత్రం పాన్ ఇండియా మార్కెట్ ని షేక్ చేసే టీజర్ ఇపుడు రాబోతుంది అని చెప్పొచ్చు.

# బాలీవుడ్ నటి శిల్పా శిరోద్కర్‌కు కరోనా పాజిటివ్..

**బలగం టీవి, హైదరాబాద్**



బాలీవుడ్ నటి శిల్పా శిరోద్కర్ కొవిడ్ పాజిటివ్‌గా తేలారు. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. తనకు కొవిడ్ పాజిటివ్ వచ్చిందని.. అందరూ జాగ్రత్తగా ఉండాలని.. ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలంటూ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో సూచించారు. టాలీవుడ్ నటుడు మహేశ్ బాబు భార్య నమ్రతా శిరోద్కార్ సోదరియే శిల్పా శిరోద్కర్. పలువురు అభిమానులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

శిల్పా శిరోద్కర్ పలు బాలీవుడ్ సినిమాల్లో నటించారు.టీవీ సీరియల్స్‌లోనూ నటిస్తున్నారు. ఇటీవల రియాలిటీ షో బిగ్ బాస్ 18లో పాల్గొంది. గ్రాండ్‌ఫినాలే వీక్‌లో ఎలిమినేట్ అయ్యింది.